# డైవోర్స్



అది పీపుల్స్ కోర్ట్. ఇటువంటివి కొత్తగా స్థాపింపబడి నడుస్తున్నాయి. కుటుంబ కలహాలు, సమిష్టి కుటుంబ కలహాలూ, సమిష్టి వ్యాపారం కలహాలు, దంపతుల పొలయలుకులు, తల్లీ బిడ్డల తగాయిదాలూ, తండ్రీ కొడుకుల పోట్లాటలూ, సర్దుబాటు చేసి పరిష్కరింపబడాలని సర్కారు సదాశయం. సమ స్వభావం వ్యాప్తిలోకి తేవాలని వుద్దేశం. చట్టముకాక, ధర్మమార్గాలూ, ఆపద్ధర్మ రీతులూ కూడా వాడి వాదించి సర్దుబాటు చేస్తారు న్యాయవాదులూ న్యాయాధీశులూనూ. ఒక స్కీమ్ పెట్టారు, పాఠశాలల లోనూ, కళాశాలలలోనూ, ఆ మాటకొస్తే విశ్వవిద్యాలయాలలో కూడా రోజుకో గురువు, అదే వుపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయిని మోరల్ ఇన్‌స్ట్రక్షన్ అని చిన్న వుపన్యాసం దంచుతారు పదినిమిషాలు. తరగతి మొదలయే ముందు వరండాలోగానీ చెట్టు నీడనగానీ గుమిగూడుతారు బాగుపడేవారంతా.

న్యాయాధీశుని ముఖ్యాశయం విడాకులాపాలని. దేనికి పెళ్లి చేసుకున్నట్టు? దేనికి చేసినట్టూ పెళ్లీ? విడాకులిచ్చుకోవాలనా? అలార్మింగ్ రేటులో డైవోర్స్ కోసం అర్జీలొస్తున్నాయి. ఒక్కోసారి ఆలుమగల ప్రమేయం లేకుండా న్యాయవాదులే వాదించుకొని కోర్టుద్వారా విడాకులు పట్టుకు పోతారు. అది మరీ విచిత్రం. పెళ్లి అనే తంతు ముగిసి మహా అయితే నెల అయివుంటుంది. బిడ్డలు కలిగినా, కలక్కపోయినా ముందే కలిగి వున్నా, సవితి పిల్లలు కావచ్చు, లేదా ఎక్స్ హజ్‌బెండ్ సంతు కావచ్చు, లేదా యేటాపంట పండించాలా? అనో, కారణమేదైతేనేమి? వయఃపరిమితీ లేదు విడాకులడిగేవారికి అది మరీ వినోదమిస్తుంది.

ప్రవక్త తెచ్చిన మతమే నయం. నాలుగు పెళ్ళిళ్లకి హద్దుబెట్టి మతం శాంక్షన్ చేసింది. వాటిలో షరతులింకా బాగున్నాయి. అందులో ధర్మమేగాక దయ గూడా యిరికించాడు ప్రవక్త. తన కన్నా పెద్ద అయినా పర్వానై. చిన్న అయితే మరీ

మంచిది. భర్తవున్నా పోయినా ఫర్వానై. సంతానమున్న అడ్డు లేదు. వయస్సులో తేడాతో నిమిత్తము లేదు. వేరే వర్ణమయినా పెళ్లాడచ్చు. మొగలాయీ చరిత్రలో అన్నీ కనబడతాయి. అంతా ప్రవక్త బిడ్డలే అవుతారు.

న్యాయాధీశుని ఆశయాలు నెరవేర్చుకునేందుకు దేవుడనుకూలించాడు. కళ్లు వత్తుకుంటూ, ముక్కు నలుపుకుంటూ లోపల వ్యధ పైకి రాకుండా వొత్తిపెడుతూ కేసంతా విన్నారు. చదివారు. భార్యాభర్తలు విడిపోవటం యిష్టం లేదు. విడిపోవచ్చనే చట్టం అమలులోకి వచ్చిందనీ తన చేతులారా వారిని విడదీయటమనేది బాధాకరం. కామన్ వుమన్‌లాగా కామన్ కోర్టూ వదలదు. గడ్డు రోజుల్లో తనకు ఆకలీ, నిద్ర లేమీ మిస్ట్రెస్‌లుగా తోడున్నాయని వాపోయాడు ఫ్యూరర్. నియంతకాకముందు వ్రాసిన మైన్ కాంఫ్‌లో వుటంకించాడు.

దైవాన్ని తలుచుకుని "యీ డైవోర్సు ఆపేయ్ ప్రభూ!" అనుకుంటూ ప్రభుదయవల్ల సాయం వల్ల చాలా విడాకులాపేయగలిగాడు న్యాయాధీశుడు. కొందరాయన సలహాకు తల ఒగ్గారు. మరికొందరు రాజీకి ఒప్పుకున్నారు. కొంత మంది పరిహారమివ్వలేక కలిసి జీవించటానికే ముందుకొచ్చారు. కొంతమంది న్యాయాధీశుని మాటలు తూస్కరించి విడిపోయారు. పరిహారం త్యాగం చేసి మరికొందరు విడిపోయారు. అలా నేర్పు ఓర్పు వెచ్చిస్తూ వుద్యోగ నిర్వహణ చేశారు న్యాయాధీశులు. వారు అధిష్టించింది ధర్మాసనం గదూ!

మధ్యాన్నం లంచ్ టైమ్ ముగిసింది. మళ్లా న్యాయస్థానం పనిలో మునిగింది. అది ఆనాటి కేసు. వాదీ ప్రతివాదీ యెదురెదురుగా బోనుల్లో నిలబడి వున్నారు. పెండింగ్‌లో నానిన ఆ కేసెలాగైతేనేం విచారణ కొచ్చింది. ట్రయల్, తీర్పూ జరిగాలని వాది తహతహలాడుతున్నది. విడాకులకు పిటీషనరాయె. ప్రతివాది చూపులకే నిమ్మకు నీరెత్తినట్టున్నాడు. ఈ కేసెలాగూ పరిష్కరింపబడదు. తేలదు. కావాల్సినవీ, ఋజువు చేయాల్సినవీ అంశాలు లేవు. పిటీషనర్ యిచ్చిన

వాదనలో చాలా లూప్‌హోల్సున్నాయని యే న్యాయశాస్త్ర కోవిదుడు కేసు పట్టలేదు. డిఫెన్సూ లేదు. మాబాగా జరిగింది. కుక్క ఆశ గుండ్రాయితో తీరిందని నవ్వినవాళ్లున్నారు. మనమన్నా పచ్చతాడు తెచ్చి మూడు ముళ్లూ వేయిద్దామని ముందుకొచ్చినవారే లేరు అనాడు. పైకి నవ్వరాదని సభ్యత గాదని లోలోన పొట్ట వుబ్బేశారు.

ప్రతివాది అమాయకునిలాగా చూడగలడు.

రివాజు ముగియగానే వాది అందుకున్నది.

''యువరానర్! మీ అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేయకుండా విడిపోవాలని యెందుకంటున్నానో చెపుతాను. మొదటి పాయింటు. ప్రతివాది నన్ను మైనం బొమ్మని చేశాడు. చాలా మార్పులు, సొట్టలూ పడేశాడు. నొక్కి నొక్కి తనకిష్టమైన ఆకారం తెప్పిస్తూ వెచ్చబడుతూ రంగులు మారుస్తూ రూపము మార్చాడు. మాయల మరాఠీ బాలనాగమ్మను కుక్కగా మార్చి తీసికెళ్లినట్టు, కుక్కను చేశాడు. మరోసారి కాకాబట్టే కామమ్మను చేశాడు. ఇంకోసారి అత్తెసర్లు పెట్టి వడ్డించే వంటలక్కగా మార్చాడు. ఘోషా స్త్రీలాగా పరదా వెనక వుంచాడు. గ్రామ పెద్దలాగా మొక్కులందుకోమనీ దీవించమనీ డిక్రీ యిచ్చాడు. భట్రాజులాగా పొగిడి తోకలుపట్టుకు తిరుగుతూ సంఘసేవికలాగా కనపడాలిట. టేమింగ్ ది ష్రూ అనే షేక్స్పియర్ నాటకంలో నాయకలాగా సూర్యుడు అంటే ఔను మండుటెండ అనాలిట. మతిబోయిందా చంద్రుడు అంటే వెంటనే వెన్నెలెంత ఆహ్లాదకరంగా వున్నదీ అనాలన్నాడు. అచ్చం అదేస్టైల్ యువరానర్. తాను గౌరవిస్తుంటే నేను వారిని గౌరవించాలి. తాను ద్వేషించగానే నేను ప్లేటు ఫిరాయించి నేనూ వారిని ద్వేషించాలి. సిరియాలుని నాటకంలో లాగా అభ్యాగతుల్నీ మేపమని, మంత్రాల మాచమ్మలాగా మంత్రం వేసే, లేదా పాతివ్రత్య మహిమ అప్లై చేసీ తాను పేర్కొంటున్నవి వడ్డించాలి. లేదు అనగూడదుట యెందుకని డైవోర్సు కోరరాదు యువరానర్?'' అనడిగింది వణికే గొంతుతో.

న్యాయాధీశుడు కళ్లజోడు మీదినించి చూస్తూ వాదినడిగాడు. మార్దవంగా సానుభూతితోనే అడిగాడు.

''న్యాయవాదిని పెట్టుకోలేదా అమ్మా? కంఠశోష తప్పేదే?''

''థాంక్స్ యువరానర్. మగ న్యాయవాది అయితే ప్రతివాది పక్షం వాదిస్తాడు. స్త్రీ న్యాయవాదిని ప్రతివాది నేర్పుగా బ్రెయిన్ వాష్ చేసి తన పక్షం చేసుకుంటాడు'' అని ముక్కు నలుపుకున్నది వాది.

''మహిళా న్యాయాధీశులున్నారమ్మా. ఆ మాటకొస్తే పెద్ద రాంక్‌లో మహిళలున్నారు. దిట్టలే. న్యాయన్యాయాలు కనిబెట్టేస్తారు. కారాగార మహిళాధీశులు హోరాహోరి పోరాటం సలిపి గెలుచుకొస్తున్నారు. పర్వతారోహకులై అబలలము కాదంటున్నారు. విలేఖరులై వార్తలు సేకరిస్తున్నారు. ''యిబ్బంది యెలా వస్తుందంటే యువరానర్ ఓట్లు చీలదీసినట్టు పదవులూ సీట్లూ పంచుకున్నట్లూ రాజకీయాలు అప్లై చేసి, ప్రలోభ పెట్టి తీయని మాటలతో, నవ్వు మొహంతో టోకరా వేసి తను చెప్పినట్టు చేయిస్తాడీ ధీశాలి. ప్రతివాది పైకి దేబెలాగా చూస్తూ మాస్ హిప్నాటిజమ్ అప్లై చేస్తాడు. దాంతో సమ్మోహితులౌతారు. అర్జునుడు చూడండి యువరానర్, రక్తపుబొట్టు రాలకుండా సమ్మోహనాస్త్రం వేసి, తలపాగాలు వేసితెచ్చి ఉత్తర బొమ్మ పొత్తికలకిచ్చాడు. సర్వెంట్సే నాకు వెరవకుండా తను చెప్పిన పని వెంటనే చేసేట్టు బుజావు చేసి బాగా హర్ట్ చేశాడు. అంతెందుకు యువరానర్, పక్కింటి అమ్మాయి ఆరేళ్లది నాకు అలవాటై నాతో తిరుగుతుంటే, చదువు సంగీతమని నేరుస్తుంటే, యీ ప్రతివాది కన్నుకుట్టింది. ఆ పిల్లను నేర్పుగా తనకు మాలిమి చేసుకుని, దినామూ యీవెనింగ్ పార్క్‌కి వాకింగుకని చేయిపట్టుకు తీసికెళ్లి చాకలెట్లు, ఐస్ క్రీమూ కొనిబెట్టి మచ్చిక చేసుకున్నాడు యీ ప్రతివాది. నాదీ మనమరాలితో కాలక్షేపం చేసే వయసే. ఆ పిల్ల క్రమంగా నన్ను హేట్ చేయసాగింది'' అని శోకం అందుకుంటే న్యాయాధీశుడు జాలిగా చూశాడా వాదిని.

''దేనికలా చేసేవాడో తెలుసుకుందామమ్మా. ఇఫ్ యూ డోంట్ మైండ్ క్వైటె ఫ్యూ వుదాహరణలివ్వచ్చు'' అన్నాడు ఓదార్పుగా. నేను నీపక్షమేనన్నట్టు ధ్వనించాయా మాటలు.

''మిమ్మల్ని నొప్పిస్తానేమో యువరానర్. జెలసీ యువరానర్. నీ గొప్పం లేదు. నేనే సమర్ధుడిని అని ప్రూవ్ చేస్తాడన్నమాట. తనకు సమ్మోహన శక్తి వున్నదని ఓ ఐడియా. మరోవిధంగా చెప్తే పాప్యులిస్ట్. పాప్యులిస్ట్ చివరికి నూసెన్స్ కింది కొస్తారని వ్రాసి వుంటే చదివా యువరానర్. సంతానం గూడా తన అనుమతి మీదే కననిస్తేనే, కని పెంచాలిట. మళ్లా అందులో మరో తిరకాసున్నది యువరానర్. మళ్లా పెంపకం తన చేతులో పెట్టుకున్నాడు. మనకు గజాసురుడు, తారకాసురుడు, నరకాసురులెందరో ఉన్నారండీ మైథాలజీలో వీడు టోకరాసురుడంటే సరీగ్గా సరిపోతుంది. ప్రెగ్నెంట్ అనే మాట వుచ్చరించానా పిడుగు పడ్డట్టు చూసి, వెల వెల పోయి ''మరీ దగ్గరైందే, వీగ్గా వున్నావు. మనింటికి తరచూ వస్తూ నిన్ను ముద్దుగా గౌరవంగా ట్రీట్ చేస్తున్న డాక్టర్ సుమిత్రా యెబార్షనిస్టు. నిరపాయకరంగా చేస్తుందనీ సక్సెస్ అవుతున్నాయనీ పేరుబడింది సుమిత్ర. ఆమె అంతట ఆమె యీ టాపిక్ మీద మాట్లాడింది. రేపు డిన్నరిస్తున్నా. ఇంకా డాక్టర్లూ వస్తారు. గౌరవంగా సరసంగా మాట్లాడాలి నువ్వు. ఫ్రెండ్లీగా వుండాలి. నవ్వుతూ భయం లేనట్టు మాట్లాడాలి'' అలా వుపోద్ఘాతం మొదలైంది యువరానర్. డిన్నర్ ఎండింగ్ శుభం అనే వరకూ, ఆమెతో కలవలేదు నేను. నవ్వుతూ నవ్విస్తూ, తైరు పోస్తూ, యితరులు నవ్వుతున్నా గమనించక చిత్రం చివరి వరకూ నటిస్తూనే వున్నా యువరానర్. రాని నవ్వూ నవ్వాను. యెలాగైతేనేం అతిథులు సంతోషించి వెళ్లారు. ''దగ్గరే క్వార్టర్సు. దింపుదాం రా'' అని బయలుదేరదీశాడు ప్రతివాది''. ''నడవలేదు'' అని నా చెవులో రహస్యంగా అంటుండగా ''ఇదేనా మార్చురీ!'' అని ఫెయింటవుతుంటే పట్టుకుని కళ్లమీద చేతులుంచి, బుజాన వేసుకుని నడకా పరుగూ కాకుండా మోసుకెళ్లి ఆమె క్వార్టర్సు చేరి తలుపు తీసి బెడ్ మీదుంచి, చిచ్చి కొడుతూ లల్లబీ పాడి ఆమె

నిద్రలోకి జారిందని నమ్మకం కలిగాక, ఆయాతో చెప్పి తలుపేసుకోమని వచ్చారు. అందాకా నేను రోడ్డు మీద మార్చురీకి కొద్ది దూరంలో వుండిపోయాయా యువరానర్'' అంటుంటే వాది మొహం యెర్రబారి వుబ్బింది.

కోర్టులోని సభికులు నవ్వు పైకి రాకుండా జాగర్త పడ్డారు.

''అసలు తలపెట్టిన దేమైందీ?'' అన్నారు న్యాయాధీశులు.

'పనేమో సగమైంది యువరానర్. చెన్నైలోని పేరుబడిన నర్సింగ్ హోమ్ నించి ఫోన్‌కాల్ వచ్చిందట. డెలివరీ కాక ఒక పేషంటు చావు బతుకుల్లో వున్నదిట. యేడుపందుకున్న యెబార్షనిస్టుని ప్రతివాది, ఆమె కార్లో, సమయానికి డ్రైవరు లేడుట, తానే డ్రైవరై, చావు బతుకుల్లో వున్న స్త్రీని బతికించాలని చెన్నై వేపు పరుగెత్తిస్తుంటే, వర్రీ అవుతున్నాడేమో ప్రతివాది అని జాలిగుండెగల ఎబార్షనిస్టు ధైర్యం చెప్పి హామి యిచ్చిందట. ''భయం లేదు. అంతా పూర్తి చేశా. ఆధారంలేని పిండం అదే కిందబడిపోతుంది. డేంజరైతే నా ప్రాణాలిస్తా'' అన్నదని థాంక్సు కింద ముద్దులు కురిపించారట. తనే చెప్పారు ప్రతివాది. ఇందులో కల్పనలేదు. ఇంకా వినగలరా? నన్ను కాపాడింది పరమేశ్వరేనని కాపలా వుంచి వెళ్లిన, నర్సు అన్నది యువరానర్'' అలా వెళ్లగూడదమ్మా. అదొక మిష అంతే'' అన్నది. తల వూపుతూ వింటున్నారు న్యాయాధీశులు. సభికులూ లేవలేదు. సీట్లకతుక్కునే వున్నారు. ప్రోత్సాహం లభించి వాది కంటిన్యూ చేసింది.

'' ఒక దాని కంటె మరొకటి మరీ యింకా యింటరెస్టింగా వుంటాయి వుదాహరణలు యువరానర్. ఒక దర్జీవాడు బాగా కుడతాడనే పేరు తెచ్చుకున్నాడు. త్వరగా తెచ్చిస్తాడు. హై క్లాసే అని వెంటబెట్టు కొచ్చి చెప్పారు యువరానర్. నువ్వు తెచ్చుకున్న బ్లౌజ్ పీసెస్ యియ్యి'' అన్నాడు ప్రతివాది.

కొలతలు వ్రాసి వున్న కాగితమూ నమూనా జాకెట్టు యిచ్చాను యువరానర్. కాని కుట్టితెచ్చిన బ్లౌజెస్ యింట్లో బెడ్‌రూమ్‌లోకి పోయి ట్రై చేస్తే బిగుతైనై యువరానర్. బైటికొచ్చి అదే అన్నా '' ఇవి నేనిచ్చిన కొలతలూ

గావు. నమూనా యివ్వటం వ్యర్థమైంది అన్నా''. టెయిలర్ నవ్వి '' అక్కాయి లావైంది'' అన్నాడు. ప్రతివాది వంతపాడి, ''నువ్వు ఒళ్లు తగ్గించుకో పొట్టగూడా పెరిగింది. అదీ తగ్గించుకో. తక్కువ తిను. అన్నీ సరిపోతాయి. విప్పికుంటమంటావాయేం? అతనికి టైం లేదు. ఇంకా కుట్టాల్సినవి చాలా వున్నాయి'' అనటమే గాక అతనికి లంచ్ యిప్పించి అతని కొట్టు వద్ద దింపివచ్చాడు ప్రతివాది. డైవోర్సెందుకు తీసుకోరాదు యువరానర్!' కోర్టులోని వారంతా నవ్వుతూ లేచారు. కోర్టు మూసే వేళైంది. న్యాయాధీశులు నవ్వుదాస్తూ తలవంచుకుని లేచి న్యాయపీఠం వదిలారు. ''కేసువాయిదా పడింది'' అన్నాడు గుమస్తా.

మరోసారి తన ఆధిక్యత వెల్లడైనట్లు ప్రతివాది నవ్వు మొహంతో బోను దిగాడు.

''అంతా కంఠశోష అయిందే'' అనుకుంటూ వాదీ దిగి వెళ్లిపోయింది.